సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 20 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.25

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టం రూ.16, సరాసరి రూ.10 పలికింది. మార్కెట్‌కు మొత్తం 900 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్ఠం/కనిష్ఠం
31.9°/8.4°

జిల్లా పరిధిలో గురువారం చలి తీవ్రత అధికంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి స్వల్పంగా నమోదయ్యాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని శిరసాని హిల్స్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను గురువారం పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, అడ్మిన్ ఆర్‌ఐ టైటాస్, తహసీల్దార్ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పరిశీలించారు. వేదిక నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా ఉన్నతాధికారులు ఆశీనులయ్యే వేదిక సరిపడా ఉండాలని సిబ్బందికి సూచించారు. శకటాలు వచ్చి వెళ్లడానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. స్టాల్స్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలన్నారు. 140 అడుగుల పొడవుతో అన్ని శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం కన్నా గొప్పగా నిర్వహించాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు

చెన్నేకొత్తపల్లి: విధుల్లో అలసత్వం వహించిన ముగ్గురు అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు సీడీపీఓ కవితాదేవి తెలిపారు. విధులకు సక్రమంగా హాజరు కాని బసంపల్లి అంగన్‌వాడీ కార్యకర్త మంగమ్మ, ఆయా నందిని, ఆమిదాలకుంట ఆయా నారాయణమ్మకు సూపర్‌వైజర్ విజయలక్ష్మి ద్వారా గురువారం మెమోలు అందించామన్నారు. అంగన్ వాడీ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా స్త్రీ, పురుషుల సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్‌గౌడ్, కార్యదర్శి రాగిరి రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ట్రయల్స్ నిర్వహిస్తామన్నారు. పురుషులు బరువు 85 కేజీల్లోపు, స్త్రీలు 75 కేజీల్లోపు ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు ఒరిజినల్ తీసుకురావాలని సూచించారు. మ్యాట్ షూ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 25 నుంచి 27 వరకూ విశాఖపట్నం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి 70వ కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని వెల్లడించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొత్తచెరువు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 'గర్భస్థ పిండలింగ నిర్ధారణ పరీక్షల నిషేధ' చట్టంపై వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ల తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. 20న (నేడు) ఆయా పాఠశాలల్లో పోటీలుంటాయన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి జిల్లాస్థాయి పోటీలను ఈ నెల 21న కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు.

22 నుంచి అనంత వేదికగా సీకే నాయుడు క్రికెట్ టోర్నీ



టోర్నీకి సిద్ధమవుతున్న అనంత క్రీడా మైదానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీ మరో సారి అనంత వేదికగా జరగనుంది. ఇందుకు అనంత క్రీడాగ్రామంలోని ప్రధాన క్రికెట్ మైదానాన్ని నిర్వాహకులు సిద్ధం చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ నెల 22 నుంచి టోర్నీ నిర్వహించనున్నారు. తొలి మూడు రోజులు ఆంధ్ర, గుజరాత్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. అనంతరం 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ ఆంధ్ర, బీహార్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించనున్నారు. గురువారం సాయంత్రం ఆంధ్ర, గుజరాత్ క్రికెట్ జట్లు అనంత క్రీడా మైదానానికి చేరుకున్నాయి. శుక్రవారం నుంచి ప్రాక్టీస్ సెషన్‌లో ఆయా జట్లు పాల్గొననున్నాయి. మ్యాచ్ రెఫరీగా సునీల్ చతుర్వేది, అంపైర్లుగా నిఖిల్ మినస్, సుబ్రహ్మణ్యం అయ్యర్, స్కోరర్లుగా తోట విజయ్, చైతన్య, వీడియో అనాలసిస్ట్‌గా ఎస్‌ఏ రహిమాన్, అశోక్ వ్యవహరించనున్నారు.

వేమన సాహిత్యం అజరామరం





వేమన చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా, చిత్రంలో ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్, కలెక్టర్ బసంత్‌కుమార్ తదితరులు, జయంత్యుత్సవాలకు హాజరైన జనం

- ప్రజాకవి జయంతి అధికారికంగా నిర్వహించుకోవడం అదృష్టం
- రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వ కృషి
- మంత్రి ఆర్కే రోజా
- సీఎం జగన్ నిర్ణయంపై అన్ని వర్గాల హర్షం: ఎమ్మెల్యే సిద్దారెడ్డి
- భవిష్యత్తు తరాలకు వేమన సందేశాన్ని అందిద్దాం: ఎమ్మెల్యే శంకరనారాయణ
- కటారుపల్లిలో ఘనంగా యోగి వేమన జయంత్యుత్సవం

గాండ్లపెంట: యోగివేమన తన పద్యాలతో పామరులను సైతం చైతన్యవంతం చేశారని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆయన సాహిత్యం అజరామరమని పేర్కొన్నారు. మండల పరిధిలోని కటారుపల్లిలో గురువారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగి వేమన జయంత్యుత్సవాల్లో మంత్రి రోజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేమన ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. సమాధిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి రోజా మాట్లాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతి ఉత్సవాలను జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. 17వ శతాబ్దంలో ఆయన రాసిన పద్యాలు నేటికీ జనం నోట నానుతుండడం గొప్ప విషయమన్నారు. తెలుగు గడ్డపై అలాంటి మహనీయుడు జన్మించడం మన అదృష్టమన్నారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి సీఎం జగన్ ఆదేశాలతో పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్థానికుల కోరిక మేరకు గాండ్లపెంట పేరును వేమన గాండ్లపెంటగా మార్చే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మాట్లాడుతూ వేమన జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. తిమ్మమ్మ మర్రిమాను, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతోనే వేమన జయంతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రజాకవి పద్యాలను భవిష్యత్తు తరాలకు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వేమన చిత్రపటం, వేమన పద్య పుస్తకాలను, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, యోగి వేమన పీఠాధిపతులు వైట్‌రెడ్డి, చెన్నారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, చంద్రశేఖర రెడ్డి, టూరిజంశాఖ, పోలీసు ధికారులు, పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఓలను దుశ్శాలువతో సన్మానించారు. మంత్రిని ఏపీ రెడ్డి సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ బసంత్ కుమార్, సర్పంచ్ గంగోజమ్మ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి తదితరులు పాల్గొన్నారు.



వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రోజా, ప్రజాప్రతినిధులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

'వేల వెలుగుల వేమన' పుస్తకావిష్కరణ

వేమన శతకంలోని 105 ముఖ్యమైన పద్యాలతో మంత్రి ఆర్కే రోజా సంకలనం చేసిన 'వేల వెలుగుల వేమన' పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. కాగా, వేమన జయంత్యుత్సవాల సందర్భంగా గ్రామానికి చేరుకున్న మంత్రి, ప్రజాప్రతినిధులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ పూలు జల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం వేమన ఆలయాన్ని మంత్రి సందర్శించారు. గోడలపై లిఖించిన వేమన పద్యాలను ఆసక్తిగా తిలకించారు. ఆలయ నిర్వహణపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు.

ఖాద్రీశుని సేవలో మంత్రి రోజా



మంత్రి రోజాకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఆలయ సిబ్బంది

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా గురువారం దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను వివరించారు. తీర్థ ప్రసాదాలు అందించి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. మంత్రిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీగా విజయకుమార్



విజయకుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

అనంతపురం: ఆర్జీయూకేటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్-ఏపీ) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన జేఎన్‌టీయూ (ఏ) రెక్టార్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. అదనంగా ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతలు చేపట్టాలని గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూజివీడు, ఆర్కే వ్యాలీ (ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం ఐఐఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. ఇందులో ఆరు సంవత్సరాల ఇంజినీరింగ్ కోర్సు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకు రెసిడెన్షియల్ శిక్షణతో పాటు నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను ప్రభుత్వమే అందిస్తుంది. ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు విజయకుమార్ తెలిపారు.

వసూల్ పక్కా..

- సోములదొడ్డికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల తొమ్మిదో తేదీన తన భూమికి సంబంధించిన ఆర్‌హెచ్ నకలు తీసుకోవడానికి అనంతపురం వచ్చారు. వాస్తవానికి దీని ఫీజు రూ.500. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది అతని నుంచి రూ.2వేలు వసూలు చేశారు. అడిగింది ఇవ్వకపోతే రేపు రా.. మర్నాడు రా.. అని తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.
- రెండ్రోజుల క్రితం అనంతపురం కోవూరునగర్‌కు చెందిన ఓ వ్యక్తి శివారు ప్రాంతంలో 20 సెంట్ల భూమి కొన్నాడు. మార్కెట్ విలువ ప్రకారం ఫీజు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలి. సైట్ చూడాలని రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్ అన్నారు. దీంతో రిజిస్ట్రేషన్ వ్యాల్యూ పెంచుతారేమోనని భయపడ్డ ఆ వ్యక్తి రూ.30 వేలు సమర్పించుకున్నాడు. దీంతో క్షేత్ర పరిశీలన లేకుండానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది.

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా వసూళ్లు
- ఇవ్వకపోతే మార్కెట్ వ్యాల్యూ పెంచుతామని బెదిరింపు
- అడిగినంత సమర్పించుకుంటున్న క్రయవిక్రయదారులు
- మరోవైపు ఇష్టారాజ్యంగా స్టాంపులు విక్రయిస్తున్న వెండర్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: సామాన్యులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళితే ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. బయటేమో స్టాంపు వెండర్లు రూ. వంద స్టాంపు పేపరును రూ.300 దాకా వసూలు చేస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళితే అక్కడా దోచుకుంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్లు, కిందిస్థాయి సిబ్బంది, డాక్యుమెంటు రైటర్లు మొత్తం కుమ్మక్కై భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఓ సబ్‌రిజిస్ట్రార్ సస్పెండ్ అయినా సరే.. భయపడే ప్రసక్తే లేదన్నట్టున్నారు.

అడిగింది ఇవ్వకపోతే సైట్ చూస్తాం..

ప్రతి ఏరియాలోని భూమికీ ప్రభుత్వం నిర్దిష్ట ధర నిర్ణయిస్తుంది. శివారు ప్రాంతాల్లో భూముల రేట్లు పెరిగాయి. కానీ రిజిస్ట్రేషన్ చార్జీలు పాతవే ఉన్నాయి. అలా ఎవరైనా శివారు ప్రాంత భూముల రిజిస్ట్రేషన్‌కు వస్తే సబ్‌రిజిస్ట్రార్లకు పండగే. ఇవ్వకపోతే 'సైట్ విజిట్' పేరుతో బెదిరిస్తున్నారు. సైట్‌కు వెళితే మార్కెట్ వ్యాల్యూ పెంచుతారని, దీనివల్ల రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ వ్యయం అవుతుందన్న భయంతో రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ సబ్ రిజిస్ట్రార్లకు క్రయవిక్రయదారులు ముట్టచెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అన్ని చోట్లా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అడిగింది ఇవ్వకపోతే ప్రతి డాక్యుమెంటులోనూ కొర్రీ వేసి ఆపేస్తారు.

డీఆర్‌ను బెదిరిస్తున్నారు..

అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులే జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్)ను బెదిరిస్తున్నారు. దీన్నిబట్టి అధికారుల బలహీనతలను సిబ్బంది సొమ్ముచేసుకుంటున్నారు. లేదంటే సెలవుపై వెళతామని.. లేదా మావాళ్లు ఫలానా సంఘంలో ఉన్నారని బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ అన్నిటికీ తల ఊపాల్సి వస్తోంది. ఇక స్టాంప్ వెండర్లయితే స్టాంపులను ఎక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఆరోపణలపై విచారణ చేస్తున్నాం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆరోపణలు వచ్చిన మాట నిజమే. ఈ ఆరోపణలపై విచారణ చేస్తున్నాం. డీఆర్‌ను నివేదిక ఇవ్వాలని కోరాను. నివేదిక వస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. – మాధవి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ

15 మందిపై నిషేధం

స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై తాజాగా విజిలెన్స్ తనిఖీలు నిర్వహించాం. ఇందులో 15 మంది అధీకృత విక్రయదారులు పక్కా ఆధారాలతో దొరికారు. వీరి నుంచి స్టాంపులు స్వాధీనం చేసుకుని, లైసెన్సు సీజ్ చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌కు రాశాం. – వీరరాఘవరెడ్డి, విజిలెన్స్ డీఎస్పీ

మైనర్లు వాహనాలు నడపొద్దు

- కలెక్టర్ బసంత్‌కుమార్



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

కదిరి: మైనర్లు వాహనాలు నడపరాదని కలెక్టర్ పి. బసంత్‌కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కదిరి ఎంవీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో లారీ, మినీ లారీ ఓనర్లు, డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించడం అందరి బాధ్యత అని, అలా చేసిన వారిని ప్రభుత్వం ప్రశంసిస్తుందే తప్ప ఎలాంటి కేసులు నమోదు కావన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు దారితీసే కారణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వాహన చోదకులు సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఎస్.ఎస్.కరుణసాగర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో టీడీపీకి దిక్కేదీ..!?

- పార్టీ ఇన్‌చార్జ్ ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల వేరుకుంపట్లు
- తలోబాటలో టీడీపీ కేడర్



మడకశిర: నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి రోజు రోజుకూ మరింత దిగజారుతోంది. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వేరుకుంపట్లు పెట్టుకోవడంతో కిందిస్థాయి కేడర్ నిరాశనిస్పృహల్లో కూరుకుపోతున్నారు. పార్టీ అధిష్టానం ఆశీస్సులతో గుండుమల పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండగా, ఈరన్న, ఆయన వర్గీయులు అంటీముంటనట్లుగా ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు.

ఈరన్నా.. దూరముండన్నా..!

'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని రాష్ట్రంలో టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగుతుంటే 'మడకశిర'లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి. పార్టీ ఇన్‌చార్జ్ అయిన ఈరన్న నాయకత్వంలో జరగాల్సిన కార్యక్రమం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరుగుతోంది. హైకమాండ్ ఆదేశాలతోనే ఈరన్న దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజులు తన వర్గంతో కలిసి కార్యక్రమం నిర్వహించిన ఆయన ఆ తర్వాత పూర్తిగా కానరాకపోవడం ఈ మాటలకు బలం చేకూరిస్తోంది.

తమ్ముళ్లలో అసహనం..

పార్టీ అధిష్టానం ఆదేశాలు ఈరన్న వర్గానికి మింగుడుపడడం లేదు. ఇన్‌చార్జ్‌నే పార్టీ కార్యక్రమాలకు దూరం ఉండాలని చెప్పడం పట్ల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒక సారి ఎమ్మెల్యేగా గెలిచి రెండు సార్లు ఓడి పోయి పార్టీ కోసం ఆర్థికంగా కూడా నష్టపోయిన వ్యక్తిని గుర్తించకుండా నిన్న మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం పట్ల కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని 5 మండలాలకు ఏర్పాటు చేసిన పార్టీ కమిటీల్లోనూ ఈరన్న వర్గానికి పదవులు దక్కకపోవడంపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది.

అధినేత పంచాయితీ చేసినా అదే తంతు..

ఈరన్న, గుండుమల వర్గాల మధ్య ఆధిపత్య పోరు రెండేళ్లుగా సాగుతోంది. అధినేత పిలిచి పంచాయితీ చేసినా ఏకం కాలేదు. ఎవరికివారు విడివిడిగానే పార్టీ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఈరన్నను పూర్తిగా పక్కన పెట్టేలా అధిష్టానం వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. రిజర్వ్ నియోజకవర్గమైన మడకశిరలో ఎస్సీ వర్గానికి చెందిన ఈరన్నకు కాకుండా మరొక వ్యక్తికి టీడీపీ అధినేత చంద్రబాబు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఈరన్న వర్గీయులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. కొన్నేళ్ల నుంచి పార్టీ జెండా మోస్తున్న నాయకులు, కార్యకర్తలు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. నియోజకవర్గంలో అంతంత మాత్రంగానే ఉన్న టీడీపీ బలం ఈ పరిణామాలతో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి చేరుకుంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి

- పుట్టపర్తికి పటిష్ట భద్రత కల్పించాలి
- అనంతపురం రేంజి డీఐజీ రవిప్రకాష్



మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్, చిత్రంలో ఎస్పీ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని అనంతపురం రేంజి డీఐజీ రవిప్రకాష్ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీపీఓ, స్పెషల్ బ్రాంచి, డీసీఆర్బీ విభాగాల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టపర్తి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో ప్రముఖులు, విదేశీయుల తాకిడి అధికంగా ఉంటుందని, నిత్యం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. హిందూపురం, కదిరి లాంటి సున్నితమైన ప్రాంతాల్లో మత సంబంధిత గొడవలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలు, ఫ్యాక్షనిస్టుల కదలికలను గమనించాలన్నారు. కోర్టు మానిటరింగ్ సిస్టం విభాగ సిబ్బంది చురుగ్గా పని చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. అసాంఘిక శక్తుల సమాచార సేకరణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలన్నారు. గల్ఫ్ దేశాలకు మనుషులను తరలించే ఏజెంట్లపై దృష్టి సారించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను ఎస్పీలు, డీఎస్పీలు తరచూ సందర్శించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, తదితరులున్నారు.

డీఎస్సీ పోస్టుల్లోనూ వర్క్ అడ్జెస్ట్‌మెంట్

అనంతపురం: స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం నేరుగా, 30 శాతం డీఎస్సీ ద్వారా భర్తీకి అడుగులు పడుతున్నాయి. తాజాగా 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రతి సబ్జెక్టుకూ స్కూల్ అసిస్టెంట్ ఉండాలని నిర్ణయించిన నేపథ్యంలో ఏ ఒక్క పోస్టు ఖాళీ ఉండకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు 30 శాతం పోస్టుల్లోనూ వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేశారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. 56 స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పోస్టులకు 116 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 16 మంది మాత్రమే ఆమోదం తెలిపారు. మేథమేటిక్స్ 20 పోస్టులకు 40 మందిలో ఐదుగురు ఆమోదం తెలపగా, సోషియల్ స్టడీస్‌కు ఐదు పోస్టులకు 10 మందిని పిలవగా ఎవరూ అంగీకారం తెలపలేదు. డీఎస్సీ ప్రకటన వెలువడి ఉద్యోగాలు భర్తీ అయ్యే వరకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ నిమిత్తం తాజాగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

క్లుప్తంగా

చంపుతామని బెదిరిస్తున్నారు!

- పోలీసులకు ఫిర్యాదు చేసిన డాక్టర్ మోహన్‌రెడ్డి

బత్తలపల్లి: తనను, తన కుటుంబాన్ని హత మారుస్తామంటూ దాయాదులు బెదిరిస్తున్నారని పోలీసులకు అన్నమయ్య జిల్లా పీలేరు మండలం దేవలవారిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రెడ్డి మోహన్‌రెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. బత్తలపల్లిలో నివాసముంటూ స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో 19 ఏళ్లుగా ఆయన వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... డాక్టర్ మోహన్‌రెడ్డి కుటుంబానికి స్వగ్రామంలో ఉన్న వ్యవసాయ భూమి అంశంలో దాయాదులు ఘర్షణ పడుతున్నారు. ఈ వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. గత ఏడాది డిసెంబర్ 13న సాయంత్రం ద్వారకానాథరెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసి, తన కుటుంబాన్ని హతమారుస్తానంటూ జయరామిరెడ్డి, ఆనందరెడ్డి ప్రోద్బలంతో బెదిరించాడు. అంతేకాక 'నాపై ఇప్పటికే 13 కేసులున్నాయి. మిమ్మల్ని చంపితే నాకు 14 కేసు అవుతుంది' అంటూ మోహన్‌రెడ్డిని బెదిరించారు. మోహన్‌రెడ్డి పిల్లలు ఇతర రాష్ట్రంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. చెల్లెలు సైతం ఇతర రాష్ట్రంలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో దాయాదులతో తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి భవితకు డిజిటల్‌తో నాంది



ట్యాబ్ సాయంతో నోట్స్ రాస్తున్న ఈ బాలిక పేరు ఝాన్సీ. హిందూపురం మండలం చౌలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని వ్యవసాయ పనులతో కుటుంబాన్ని తండ్రి రామాంజి, అమ్మ ఆశ పోషిస్తున్నారు. ఇలాంటి తరుణంలో అమ్మాయి చదువు వారికి భారమైంది. ప్రభుత్వం అమ్మ ఒడి పథకం అందజేస్తుండడంతో ఎన్ని కష్టాలు ఎదురైనా కుమార్తెను బాగా చదివించాలనుకున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం డిజిటల్ విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ట్యాబ్‌ను అందజేయడంతో తల్లిదండ్రుల ఆశయానికి అనుగుణంగా సెలవు రోజుల్లోనూ ఆమె ఇంటి వద్ద ట్యాబ్ సాయంతో పాఠాలు అభ్యసిస్తోంది.



ఈ బాలిక పేరు కుబ్రా. చౌళూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. సెలవు రోజుల్లో ఇంటి వద్దనే ట్యాబ్ ఆధారంగా పాఠాలు విని ప్రశ్నలకు సమాధానాలు నోటు బుక్‌లో నమోదు చేస్తోంది. అర్థం కాని పాఠ్యాంశాలను పదేపదే వినడం ద్వారా అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతోందని, ట్యాబ్ పక్కన ఉంటే టీచర్ పక్కనే ఉన్నట్లుగా ఉంటుందని చెబుతున్న కుబ్రా... తమ ఉన్నతికి ట్యాబ్‌లు అందజేసిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతోంది.

ఇలా జిల్లా వ్యాప్తంగా ట్యాబ్‌లు అందుకున్న ప్రతి విద్యార్థి సెలవు రోజుల్లో ఆటపాటలతో కాకుండా పాఠ్యాంశాల అభ్యాసనకు ప్రాధాన్యతనిస్తూ వస్తున్నారు.



ట్యాబ్‌ల సాయంతో పాఠ్యాంశాలపై చర్చించుకుంటున్న విద్యార్థులు

- బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల్లో పాఠ్యాంశాలు
- సెలవుల్లోనూ ట్యాబ్‌తో చదువుకుంటున్న విద్యార్థులు

హిందూపురం/పుట్టపర్తి అర్బన్: విద్యావ్యవస్థలో అసమానతలకు తావు లేకుండా జగన్ సర్కార్ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యను వ్యాపారంగా మార్చిన పెట్టుబడిదారుల దోపిడీకి చెక్ పెట్టేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మన బడి నాడు–నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్న ఆకాంక్షతో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక తదితర పథకాలను అమలు చేస్తున్నారు. జాతీయ నూతన విద్యావిధానాన్ని పటిష్టంగా అమలు పరచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలు మెరుగుపడేలా జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 5,760 ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేసింది.

సామాజిక అంతరాలకు చెక్..

ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందడమే కాకుండా సామాజిక అంతరాలకు చెక్ పడినట్టైంది. ధనికులు, కార్పొరేట్ స్కూల్ విద్యార్థుల చేతుల్లో ఉన్న ట్యాబ్‌లను పేద, మధ్య తరగతి పిల్లలకూ ప్రభుత్వం చేరువ చేసింది. చదువుల్లో సమానత్వం తీసుకురావడంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించేందుకు మార్గం సుగమమైంది.

బైజూస్‌తో ఒప్పందం..

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతూ విద్యారంగంలోకి విస్తరించింది. నల్లబోర్డు మాయమై డిజిటల్ బోర్డు వచ్చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి విద్యారంగంలో ఆన్‌లైన్ దిగ్గజంగా నిలిచిన బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. బైజూస్ పాఠాలను పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేరువ చేసేందుకు రూ.16 వేలు విలువ చేసే బైజూస్ కంటెంట్‌తో కూడిన మరో రూ.16 వేలు విలువ చేసే శ్యామ్‌సంగ్ ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. దీంతో ఒక్కో ట్యాబ్ విలువ రూ.32 వేలకు చేరుకుంది. ఈ లెక్కన జిల్లాలో రూ.63.44 కోట్ల విలువ చేసే ట్యాబ్‌లను 17,523 మంది 8వ తరగతి విద్యార్థులు, 2,305 మంది ఉపాధ్యాయులు అందుకున్నారు. ఇంటర్నెట్‌తో పని లేకుండా ఇందులోని పాఠ్యాంశాలను చూడవచ్చు... చదువుకోవచ్చు.

సెలవుల్లోనూ వీడని ట్యాబ్..

గతంలో పాఠశాలకు సెలవు వచ్చిందంటే విద్యార్థులు ఆటపాటల్లో నిమగ్నమయ్యేవారు. ఇప్పుడు ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. సంక్రాంతి సెలవుల్లో ఇంటి వద్ద ట్యాబ్‌ల సాయంతో బైజూస్ కంటెంట్‌పై ముమ్మర సాధన చేయసాగారు. గణితం, సైన్సు ప్రశ్నలకు జవాబులు ట్యాబ్‌లోని కంటెంట్ ద్వారా విని నోటు బుక్కుల్లో నమోదు చేస్తున్నారు.

అభ్యసన మెరుగుపడుతోంది



ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతుంది. మేము చెప్పిన పాఠాలను మననం చేసుకునేందుకు, తెలియని అంశాలను పలుమార్లు ఇంట్లోనే చూసి నేర్చుకునేందుకు ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడుతాయి. – రజని, ఉపాధ్యాయురాలు, కేజీబీవీ పాఠశాల, బుక్కపట్నం

బంగారు భవితకు బాట



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల బంగారు భవితకు బాట పడింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా రాణిస్తారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2025 నాటికి సీబీఎస్‌ఈ విధానంలో పరీక్ష రాయడానికి ఈ ట్యాబ్‌లు దోహదపడతాయి. – రాజశేఖర్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చౌళూరు.

సచివాలయాల్లోనే మరమ్మతు



విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల్లో ఏదైనా సమస్య తలెత్తితే స్థానిక సచివాలయాల్లోనే మరమ్మతు చేసిస్తారు. బోధన అంశంపై టీచర్లకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ట్యాబ్ వినియోగంపై విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాటిని భద్రంగా ఉంచుకోవాలి. – మీనాక్షి, ఇన్‌చార్జ్ డీఈఓ.

రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తాం : ఆర్డీఓ



రైతులకు సర్ది చెపుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ముదిగుబ్బ: మండలంలోని మలకవేమల, కొండగట్టుపల్లి గ్రామాల సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారాన్ని అందజేస్తామని ఆర్డీఓ తిప్పే నాయక్ స్పష్టం చేశారు. భూ సేకరణ కోసం గురువారం చేపట్టిన సర్వే పనులను రైతులు అడ్డుకుని అధికారులను ఘెరావ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులకు న్యాయమైన ధరను చెల్లించేలా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసినట్లు వివరించారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదన్నారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు. ఆ సమయంలో రైతు నరేంద్రబాబు క్రిమి సంహారక మందు తాగుతానని బెదిరించే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకుని రైతుకు సర్దిచెప్పారు. అనంతరం మలకవేమలకు చెందిన రైతులు కలసి తమకు మరింత ధర పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇస్తామని పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



నందిని (ఫైల్)

కొత్తచెరువు: మండల కేంద్రంలో గురువారం ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరానికి చెందిన నాగరాజు, గంగమ్మ దంపతుల కుమార్తె నందిని, కర్ణాటకలోని పావగడ తాలూకా అప్పాజిపల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. రెండు నెలలుగా కొత్తచెరువులోని బసవన్నకట్ట వీధిలో నివాసముంటున్నారు. వీరికి 8 నెలల పసికందు ఉంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో నందిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయాన్ని స్థానికంగా ఉన్న బంధువులకు భర్త రాజారెడ్డి చేరవేయడంతో వారు అక్కడకు చేరుకుని మృతురాలిని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న నందిని తల్లిదండ్రులు కొత్తచెరువుకు చేరుకుని కుమార్తె మృతదేహంపై పడి రోదించారు. నందిని మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు.

ఏటీఎం వద్ద రైతుకు టోకరా

చిలమత్తూరు: గుర్తు తెలియని అగంతకుడి చేతిలో చిలమత్తూరు మండలం సంజీవరాయునిపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి మోసపోయాడు. వివరాలు.. పాలు బిల్లులకు సంబంధించిన రూ.30వేలు తన బ్యాంక్ ఖాతాలో ఉందని, ఈ మొత్తాన్ని తన ఏటీఎం కార్డును ఉపయోగించి గుర్తు తెలియని వ్యక్తి కోడూరు తోపులోని నంబర్ 1 ఏటీఎం నుంచి డ్రా చేసుకెళ్లాడని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఏటీఎం కేంద్రంలోని సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా అనుమానితుడి ఫొటో సేకరించి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత దారుణ హత్య

- ప్రేమ పెళ్లి.. సర్దుకుపోలేక విడాకులు
- మరొకరితో సన్నిహితంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక ఘాతుకం
- హతురాలి సోదరుడిపై కత్తితో దాడి
- పరిస్థితి విషమం



ఆషాబీ (ఫైల్)

రాప్తాడురూరల్: ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్నాడు.. వారి ప్రేమకు గుర్తుగా ఓ కొడుకు పుట్టాడు. 15 ఏళ్ల వైవాహిక జీవితంలో మనస్పర్థలు తలెత్తడంతో సర్దుకుపోలేక విడాకులు తీసుకున్నాడు. మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక కిరాతకంగా హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... వజ్రకరూరుకు చెందిన తపాల్ బాబా బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో 17 ఏళ్ల క్రితం గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన లక్ష్మిని ప్రేమించి, మతాంతర వివాహం చేసుకున్నాడు. పెళ్లి అనంతరం తన పేరును ఆషాబీగా ఆమె మార్చుకుంది. ఇద్దరూ కురుగుంట వైఎస్సార్ కాలనీలో ఉండేవారు. వీరికి నూర్ మహమ్మద్ వలి అనే కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాలుడి వయసు 15 సంవత్సరాలు.

అధికారికంగా తలాక్ ..

కొన్నేళ్ల పాటు ఆషాబీ, బాబా జీవనం సాఫీగా సాగింది. అనంతరం బాబా శైలిలో మార్పు వచ్చింది. మద్యానికి బానిసయ్యాడు. తాగుడు అలవాటు మానేయాలని తరచూ భార్య చెబుతుండడంతో ఆమెతో ఘర్షణ పడేవాడు. బంధుమిత్రులు చెప్పినా మార్పు రాలేదు. దీంతో రెండేళ్ల క్రితం మసీదులో మత పెద్దల సమక్షంలో అధికారికంగా విడాకులు (తలాక్) తీసుకున్నారు. ఆ సమయంలో తన 13 ఏళ్ల కుమారుడిని పెద్దల మాటకు కట్టుబడి భర్త వద్దనే ఆమె వదిలేసింది. ఈ క్రమంలో అప్పుడప్పుడు తల్లి వద్దకు కుమారుడు వెళ్లి పలకరించి, తిరిగి తండ్రి వద్దకు చేరుకునేవాడు.



మృతురాలు ఆషాబీ

మరొకరితో వివాహం..

తపాల్ బాబా నుంచి విడాకులు తీసుకున్నాక అక్కంపల్లికి చెందిన నబీరసూల్‌తో ఆషాబీకి పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే నబీరసూల్‌కు అప్పటికే వివాహమై భార్య కూడా ఉంది. ఆషాబీ రెండోభార్యగా కొనసాగుతూ వస్తోంది. ఇటీవల కురుగుంట జగనన్న కాలనీలో ఆషాబీకి ఇల్లు మంజూరు కావడంతో నబీరసూల్ దగ్గరుండి నిర్మాణం పూర్తి చేయించాడు. అనంతరం కొత్త ఇంట్లోనే వారు కాపురం ఉంటున్నారు.

కళ్లెదుటే తిరుగుతుంటే జీర్ణించుకోలేక..

మాజీ భార్య ఆషాబీ తన కళ్లెదుటే మరో వ్యక్తిని పెళ్లి చేసుకుని సంతోషంగా తిరుగుతుండడాన్ని చూసి తపాల్ బాబా జీర్ణించుకోలేకపోయాడు. దీంతో ఆషాబీని హతమార్చేందుకు పథకం వేశాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుమారుడు వలితో కలసి ఆషాబీ ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. ఆ సమయంలో ఆషాబీ సోదరుడు రమేష్ వాకిలి తీయగానే బాబా ఒక్కసారిగా కత్తితో కడుపులో పొడవడంతో పేగులు బయట పడి అతను కుప్పకూలిపోయాడు. వెనువెంటనే బెడ్‌రూంలోకి వెళ్లి ఆషాబీపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఆమె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత కుమారుడితో కలసి పారిపోయాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న రమేష్‌ను స్థానికులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. అయినా రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్, ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది కురుగుంట జగనన్న కాలనీకి చేరుకుని హతురాలిని పరిశీలించారు. ఘటనపై చుట్టుపక్కల వారిని, ఆషాబీ బంధువులను ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



తీవ్రంగా గాయపడ్డ రమేష్

24న బీఫార్మసీ, ఫార్మాడీ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)లో కన్వీనర్ కోటాలో బీ.ఫార్మసీ, ఫార్మాడీ సీట్లు భర్తీ కాగా మిగిలిన సీట్లకు ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డి గురువారం వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అనర్హులుగా ఉంటారన్నారు. జేఎన్‌టీయూ (ఏ) పాలకభవనంలో జరిగే స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ రోజునే ప్రాసెసింగ్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు కుళ్లాయప్ప

కణేకల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం మాల్యం నివాసి కుళ్లాయప్ప (45) బుధవారం పొలం ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. గ్రామ శివారున పెట్రోల్ బంక్ వద్ద సమీపంలో వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన కుళ్లాయప్పను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ హత్య కుట్ర భగ్నం

- పన్నాగం పన్నిన భార్య
- సహకరించేందుకు అంగీకరించిన స్వామిజీ
- నిందితుల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఏఆర్ మాజీ కానిస్టేబుల్ ప్రకాష్ హత్య కుట్ర భగ్నమైంది. గుప్తనిధుల తవ్వకాల కేసులో నల్లమాడ పోలీసులకు పట్టుబడిన నిందితులు.. విచారణలో ప్రకాష్ హత్యకు పన్నిన కుట్రను బహిర్గతమైంది. దీంతో తదుపరి విచారణ నిమిత్తం కేసును శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అనంత పోలీసులకు బదలాయించారు. దీంతో గురువారం నిందితులను అనంతపురం రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. ప్రకాష్ హత్యకు కుట్ర పన్నిన వైనాన్ని సీఐ శివరాముడు వెల్లడించారు. ప్రకాష్, నాగమణి దంపతులు. చాలా కాలంగా ప్రకాష్ మరో మహిళతో సన్నిహితంగా ఉంటూ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని భార్య అనుమానాలు పెంచుకుంది. కుటుంబ అవసరాలు, పిల్లల బాగోగులు చూడకుండా తన సుఖం తాను చూసుకుంటున్నాడని మదనపడిన నాగమణి భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని భావించింది. ఈ క్రమంలో ఆ కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉన్న స్వామిజీ నిజాముద్దీన్‌ను సంప్రదించింది. క్షుద్ర పూజలు చేసి తన భర్త ఆరోగ్యం క్షీణించేలా చేయాలని కోరింది. ఇందుకు సమ్మతించిన స్వామిజీ పక్కా ప్రణాళికతో పూజకు రంగం సిద్ధం చేశాడు. ప్రకాష్ ఇంట్లోనే రెండు రోజుల పాటు ఉన్న అతను... పూజకు అవసరమైన విషయాలను ప్రకాష్ భార్యతో చర్చించాడు. ఈ నేపథ్యంలోనే నల్లమాడ మండలంలో గుప్తనిధుల వెలికి తీతకు సంబంధించి ఒప్పందం ఉడడంతో ఆ పని పూర్తి చేసుకుని వస్తానని చెప్పి స్వామిజీ వెళ్లాడు. ఈ లోపు నాటకీయ పరిణామాల మధ్య గుప్తనిధుల వేటగాళ్లు అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో స్వామి గుట్టు పోలీసుల విచారణలో రట్టయింది. కేసులో ప్రకాష్ భార్య నాగమణితో పాటు నిజాముద్దీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు.



నిజాముద్దీన్‌తో ప్రకాష్ (ఫైల్)

21 నుంచి విద్యాస్ఫూర్తి ఎక్స్‌పో

అనంతపురం: ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో విద్యాస్ఫూర్తి మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్ అనంతరం ఎలాంటి కోర్సులు ఎంపిక చేసుకోవాలి. బెంగళూరులో అత్యుత్తమ ఇంజినీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ కళాశాలలు, యూనివర్సిటీలను ఎంపిక చేసుకునే అంశంపై ఏర్పాటు చేయనున్న ఎక్స్‌పోలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులూ పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఎక్స్‌పోలో పాల్గొనే వారికి బహుమతుల ప్రదానం ఉంటుంది. పూర్తి వివరాలకు 78291 85383, 98458 16919లో సంప్రదించవచ్చు.